సాక్షి చిత్తూరు

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



అన్నపూర్ణా.. పాహిమాం


అన్నపూర్ణాదేవిగా బోయకొండ గంగమ్మ

చౌడేపల్లి: దసరా మహోత్సవాల్లో భాగంగా బోయకొండ గంగమ్మ గురువారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు గోవర్ధన శర్మ, గంగిరెడ్డి తదితర అర్చక బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక హోమ పూజలు చేశారు. ఉభయదారులు, ఈఓ ఏకాంబరం పాల్గొన్నారు.

విపంచి ధరించి.. విహరించి..

పాలకడలిపై తేలియాడే శేషుడు తిరువీధులకు తరలివచ్చాడు. ఆపద మొక్కుల వాడికి వాహనమయ్యాడు. శ్రీహరి చిద్విలాసంగా విహరించాడు. రాయంచ సింహాసం కాగా శ్రితపరిపాలకుడు వీణాపాణి ధరించి, విహరించాడు. వివేచన బోధించాడు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయులయ్యారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు గురువారం చిన్న శేష, హంస వాహనాలపై మలయప్పస్వామి విహరించారు. ఈ వాహనసేవల్లో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. – తిరుమల


వాహన సేవలో పౌరాణిక కళాప్రదర్శన


కళాకారులతో టీటీడీ ఈఓ సింఘాల్


నృత్యం చేస్తున్న కళాకారులు

న్యూస్‌రీల్

86,700 పశువుల కొనుగోలుకు ఆమోదం


డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు 86,700 పశువులు కొనుగోలు చేసేందుకు జిల్లా కమిటీ ఆమోదం తెలిపిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా జిల్లాలో పశువుల పెంపకాన్ని, సంఖ్యను మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. జిల్లాలో ఎక్కువ ప్రైవేట్ డెయిరీలు, 35 ప్రభుత్వ బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు ఉన్నందున పాల ఉత్పత్తి అవసరం విరివిగా ఉందన్నారు. ఈ పథకం విజయవంతంగా అమలుకు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, సీఐఎఫ్ అంతర్గత రుణాలు ఇంటర్నల్ లెండింగ్ వంటి పథకాలతో స్వయం సహాయక సంఘాల మహిళలకు నచ్చిన విధంగా ఆరోగ్యకరమైన పశువులు కొనుగోలు చేయవచ్చన్నారు.

సకాలంలో కౌంటర్లు దాఖలు చేయండి


సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కేసులకు సంబంధించి జిల్లా ప్రధాన కోర్టులో సకాలంలో కౌంటర్‌లు దాఖలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రధాన కోర్టులో నమోదైన రెవెన్యూ కేసులకు సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈ విషయంలో ఆర్‌డీవోలు, తహసీల్దార్లు అలసత్వం వహించరాదని ఆదేశించారు. జిల్లా ప్రధాన న్యాయ స్థానంలోని 14 కోర్టుల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసుల్లో 27 ఎక్స్‌పార్టీగా గుర్తించినట్లు చెప్పారు. వీటికి సంబంధించి వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్లదేనన్నారు. మండలాల పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి పూర్తి బాధ్యత తహసీల్దార్లు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎక్స్‌పార్టీగా ఉన్న కేసులన్నింటికీ రెండు రోజుల్లో రిటర్న్ స్టేట్‌మెంట్, కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. జిల్లా కోర్టులోని రెవెన్యూ కేసులకు సంబంధించి తహసీల్దార్లను సమన్వయం చేసేలా వీఆర్‌వో కేడర్ సిబ్బందిని లైజన్ అధికారిగా నియమించనున్నట్టు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9.30కు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ముఖ్య నాయకులు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొంటారని వెల్లడించింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. విష జ్వరాలు, డెంగ్యూ, డయేరియా వంటి కేసులు నమోదవుతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలోవ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అనిల్, అనూష, నవీన్‌తేజ్‌రాయ్, జార్జ్, వేణుగోపాల్, జయరాముడు, రామ్మోహన్, శ్రీవాణి పాల్గొన్నారు.

మార్గం సుగమం!

చిత్తూరు నగర నడిబొడ్డున రోడ్ల విస్తరణ అంశం తుది అంకానికి చేరుకుంది. మూడో దశ రోడ్ల అభివృద్ధి (ఆర్‌డీ) ప్రణాళికలను ఆమోదిస్తూ అధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు భవన స్థలాన్ని ఇచ్చే యజమానులకు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను ఇవ్వడానికి మార్గం సుగమమైంది. ఇక టీడీఆర్ కోసం దరఖాస్తు చేసుకునేవారికి కార్పొరేషన్ కమిటీ అధికారికంగా బాండ్లను పంపిణీ చేయనుంది.

- చిత్తూరులో రోడ్డు విస్తరణకు తుది ప్లాన్ ఆమోదం
- టీడీఆర్ బాండ్ల పంపిణీకి లైన్‌క్లియర్
- మౌలిక వసతులకు రూ.100 కోట్ల వరకు అవసరం
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచితేనే నదుపాయాలకు నిధులు

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతీ పదేళ్లకు ఓసారి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారు. పెరుగుతున్న జనాభా, వాహనాలు, ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ తయారుచేస్తారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో 2022లో నూతన మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చింది. ఇది పదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నూతన మాస్టర్ ప్లాన్ ప్రకా రం కట్టమంచి నుంచి గిరింపేట దుర్గమ్మ ఆలయం వరకు ఉన్న రోడ్డును వంద అడుగులకు విస్తరించాల్సి ఉంది. 2018లో హై రోడ్డులోని కృష్ణుడి ఆలయం నుంచి గిరింపేట దుర్గమ్మ ఆలయం వరకు ఆర్‌డీ ప్లాన్‌ను ఆమోదించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కట్టమంచి నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు, తాజాగా రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కృష్ణుడి ఆలయం వరకు ఆర్‌డీ ప్లాన్ ఆమోదించడంతో విస్తరణ పనులకు లైన్ క్లియర్ అయ్యింది. దీంతో పాటు టీడీఆర్ బాండ్ల పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా న్యాయస్థానాల సముదాయ ప్రహరీ గోడ, రైల్వే స్టేషన్, వక్ఫ్‌బోర్డు, దేవదాయ శాఖ స్థలాల్లో కట్టడాలను తొలగించారు.


ఆర్‌డీ ప్లాన్ ఆమోదిస్తూ.. సంతకం చేస్తున్న కమిషనర్


చిత్తూరు హైరోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు

టీడీఆర్ బాండ్ల జారీ ఇలా..

విస్తరణలో భవనాలు, కట్టడాలు కోల్పోయేవారికి పరిహారం స్థానంలో టీడీఆర్ బాండ్లను ఇవ్వడానికే అధికారులు ఆసక్తి చూపిస్తున్నారు. చిత్తూరు హై రోడ్డు విస్తరణలో భవన యజమానులు 600–1000 అడుగుల వరకు స్థలాన్ని కోల్పోవాల్సి ఉంటుందని అంచనా. పరిహారమైతే భూమి రిజిస్టర్ విలువ ప్రకారం రూ.100కు రూ.200 ఇస్తారు. టీడీఆర్ బాండ్లు ప్రతీ వంద అడుగులకు 400 అడుగుల విలువ చేసే పత్రాలు ఇస్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్లను జిల్లాలో మాత్రమే విక్రయించుకునే వెసులు బాటు ఉండగా, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో దీన్ని రాష్ట్రంలో ఎక్కడైనా విక్రయించుకునే అవకాశం కల్పించడంతో టీడీఆర్ బాండ్లకు విలువ పెరిగింది. టీడీఆర్ బాండు కలిగి వ్యక్తి.. తాను ఎక్కడైనా భవనం నిర్మించేటప్పుడు రెండు అంతస్తులకు అను మతి ఉంటే, టీడీఆర్ బాండు ద్వారా అదనంగా మరో రెండు అంతస్తులకు అనుమతులు పొందొచ్చు. భవ నం చుట్టూ సెట్‌బాక్స్‌ను కూడా వదలాల్సిన అవసరం ఉండదు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో సబ్–రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులను తొలగించి.. మునిసిపల్ కమిషనర్, సహాయ కమిషనర్, ఏసీపీ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్డీలను సభ్యులుగా ఉంచడంతో బాండ్ల జారీ సులభతరం కానుంది.

నిధులిస్తేనే అభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్‌లో ఇక ఎవరైనా విస్తరణ స్థలం కోల్పోయే వ్యక్తులు టీడీఆర్ బాండ్ల కోసం అధికారికంగా దరఖాస్తు చేసుకోవచ్చు. కమిటీ మార్కెట్ విలువను సబ్–రిజిస్ట్రార్ నుంచి తీసుకుని, భవన యజమానులకు టీడీఆర్ బాండ్లను జారీచేసి, ఆన్‌లైన్‌లో ఉంచుతుంది. అయితే విస్తరణలో మరో కీలక అంశం నిధుల విడుదల. ప్రస్తుతం 50 అడుగల మేరకు రోడ్డును విస్తరించాల్సి ఉంది. విస్తరించిన స్థలంలో రోడ్లు వేయడం, కాలువలు కట్టడం, విద్యుత్ లైన్లు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పనకు దాదాపు రూ.100 కోట్లు అవసరం ఉంది. కార్పొరేషన్ వద్ద అంత నిధులు లేవు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు తీసుకొస్తేనే చిత్తూరులో అభివృద్ధి చూడడం సాధ్యమవుతుంది. లేకుంటే రోడ్ల విస్తరణ కాస్త కొట్టేసిన భవనాలు, గుంతలు పడ్డ రహదారులతో అందహీనంగా కనిపించనుంది. దీనిపై కలెక్టర్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వం నుంచి నిధులు ఎలా తీసుకొస్తారని సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

గుండె, నరాల వ్యాధులకు చికిత్స


మాట్లాడుతున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గుండె, నరాల వ్యాధులకు చికిత్స అందించేలా చిత్తూరులో కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు వేలూరుకు చెందిన నర్వి ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. వారు గురువారం చిత్తూరు నగరం ప్రీతం ఆస్పత్రిలో హార్ట్ అండ్ న్యూరాలజీ స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరం నెలకు రెండుసార్లు ఆసుపత్రిలో నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. నర్వి ఆస్పత్రి నిర్వాహకులు శరవణన్ రామన్, వినాయక్ శుక్లా, జార్జ్, లోకేష్ పాల్గొన్నారు.

మామిడి పంటపై ఏనుగుల దాడి


ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని పాళెం పంచాయతీలో వున్న మామిడి తోటలోకి గురువారం తెల్లవారు జామున ఏనుగులు ప్రవేశించాయి. మామిడి చెట్ల కొమ్మలను విరిచివేశాయి. ఏనుగులు 20 రోజులుగా మండలంలో తిరుగుతూ పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చిత్తూరు అర్బన్: పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. స్వచ్ఛతాహి సేవ– 2025లో భాగంగా గురువారం చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు వద్ద ‘ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత’ కార్యక్రమాన్ని కలెక్టర్‌తో పాటు మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రారంభించారు. పార్కులో వ్యర్థాలను తొలగించారు. స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచడం కోసం వందల మంది పారిశుద్ధ్య కార్మికులు వేకువజాము నుంచే పనిచేస్తున్నారన్నారు. 50 శాతం చెత్త ప్రజల ద్వారానే ఉత్పత్తి అవుతోందన్నారు. ప్రజలు బాధ్యతగా.. బిస్కెట్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా అవగాహనతో వ్యవహరిస్తే పారిశుద్ధ్య కార్మికులపై పనిభారం తగ్గించడమే కాకుండా నగరం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ప్రార్థన స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంచడానికి ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మేయర్ అముద మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులకు ప్రజలు సహకరించాలన్నారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా నగరంలో మాస్ శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, కార్పొరేటర్ ఇందు, మునిసిపల్ డీఈ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు మేయర్‌తో కలిసి చెత్త తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సహకార సంస్థలు ఎంతో ఉపయోగకరం


సర్టిఫికెట్లు పొందిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : సహకార సంస్థలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. కళాశాలలో గురువారం సహకార సంస్థల అంతర్జాతీయ సంవత్సరం 2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సహకార సంస్థల ప్రయోజనాలను తెలుసుకుని ఇతరులకు తెలియజేయాలన్నారు. జిల్లా సహకార శాఖ అధికారిణి లక్ష్మి మాట్లాడుతూ సహకార బ్యాంకులు రైతులు, వ్యాపారులకు రుణాలను ఇస్తున్నాయన్నారు. ప్రస్తుతం సహకార బ్యాంకుల్లో ఆన్‌లైన్ సేవలు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు సహకార సంస్థల ప్రయోజనాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ చలపతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, చిత్తూరు కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ రఘుబాబు పాల్గొన్నారు.

12 ఏళ్ల తర్వాత విముక్తి


ఎస్టీలకు రిలీవింగ్ ఆర్డర్ కాపీలను అందిస్తున్న జేసీ


ఎస్టీల బాధలు వింటున్న గుడిపాల తహసీల్దార్



ఇటుక బట్టీ యజమాని ఇర్ఫాన్‌తో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

గుడిపాల: ఇటుక బట్టీలో బంధీలైన 23 మందికి ఎట్టకేలకు విముక్తి లభించింది. వివరాలు.. గుడిపాల మండలం, గట్రాళ్లమిట్ట గ్రామంలో ఇర్ఫాన్ అనే అతను ఇటుక బట్టీల వ్యాపారం చేస్తున్నాడు. ఇతని వద్ద 2013లో తమిళనాడు రాష్ట్రం, వేలూరుకు చెందిన 18 మంది, బంగారుపాళ్యం మండలానికి చెందిన ఐదుగురు ఎస్టీ కాలనీ వాసులు పనులకు వచ్చారు. అప్పట్లోనే ఇర్ఫాన్ వారికి అడ్వాన్స్‌గా రూ.5 వేలు ఇచ్చి పనిలో పెట్టుకున్నారు. అప్పటి నుంచి వారిని బంధీలుగా మార్చేశారు. ఇందులో ఆరుగురు మగవారు, మరో ఆరుగురు మహిళలు, 11 మంది పిల్లలు ఉన్నారు. వీరందరూ రోజూ ఇటుకలకు సంబంధించి మట్టి కలపడం, మోల్డింగ్ చేయడం, ఇటుకలను కాల్చడం, ఇటుకలు రవాణా చేయడం వంటి కార్యకలాపాలు చేసేవారు. ఇటీవల వీరిపై శారీరక దాడులు చేయడంతోపాటు అవమానకరమైన మాటలు, వేధింపులు ఎక్కువయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ, లేబర్, సోషల్ వెల్ఫేర్, స్థానిక పోలీసులు వెళ్లి వారి పరిస్థితులపై ఆరా తీశారు. వారికి జరుగుతున్న అవమానాలను తెలుసుకున్నారు. రోజుకు సుమారు 15 గంటలు పనిచేయిస్తుండడంతో పాటు తాత్కాలిక గుడారాలలో నివసిస్తూ, కరెంట్ కూడా లేకుండా జీవిస్తున్నట్టు గుర్తించారు.

జేసీ భరోసా

గుడిపాల మండలంలోని గట్రాళ్లమిట్టలో జరిగిన పరిణామాలపై ఎస్టీ లందర్నీ గుడిపాల తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి కూడా రాత్రి 9గంటలకు అక్కడికి చేరుకుని ఎస్టీలతో మాట్లాడారు. వారి బాధలను తెలుసుకున్నారు. వారందరికీ ఆర్థిక సాయం చేయడంతో పాటు రిలీవింగ్ ఆర్డర్ కాపీలను అందజేసి, వారి గ్రామాలకు పంపించారు. స్వేచ్ఛగా జీవించాలని సూచించారు. అనంతరం ఇటుక బట్టీ యజమాని ఇర్ఫాన్‌తో జేసీ మాట్లాడారు. ఇన్ని రోజులు వారిని ఎందుకు నీ అదుపులో పెట్టుకున్నావ్ అని ఆరా తీశారు. ఇటుక బట్టీ యజమానిపై కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఆర్డీవో శ్రీనివాసులు, డెప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సర్వేయర్ గోపీనాథ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,628 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,551 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

• ఆత్మీయ పలకరింపు



తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ భరత్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక విషయాలపై చర్చించారు.

భలే మంచి టెట్రా బేరం

• తమిళనాడుకు తరలుతున్న ఏపీ, కర్ణాటక మద్యం
• ఎస్‌ఈబీ లేక యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా

పలమనేరు: కర్ణాటక టెట్రా ప్యాకెట్ల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇటు చిత్తూరు జిల్లాతో పాటు అటు తమిళనాడుకు గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతున్నాయి. కర్ణాటకలో 90 ఎంఎల్ ప్యాకెట్ టెట్రా ప్యాకెట్ రూ.45కే లభ్యమవుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఏపీలోని సరిహద్దు ప్రాంతాల నుంచి తమిళనాడుకు చేరవేస్తున్నారు. దీనికితోడు తమిళనాడులో మద్యం కొరతను సైతం తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

బజ్జీ దుకాణాల్లోనూ మద్యమే

కన్నడ టెట్రా ప్యాకెట్లతోపాటు ఏపీ మద్యం దుకాణాల నుంచి తీసుకెళ్లే మందు విక్రయాలు జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గాల్లో ఊపందుకున్నాయి. గతంలో రహస్యంగా సాగుతున్న ఈ తంతు ఇప్పుడు బహిరంగగానే విక్రయిస్తున్నారు. గ్రామాల్లోని చిల్లరకొట్లు, టీ దుకాణాలు, హోటళ్లు, బజ్జీ, బోండా అంగళ్లల్లోనూ మద్యం లభిస్తోంది. కొందరైతే దీన్నే జీవనోపాధిగా చేసుకున్నారు.

రకరకాల మార్గాలు

కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు ఎన్నో అడ్డదారులున్నాయి. రకరకాల మార్గాల్లో నిత్యం మద్యం అక్రమంగా తరలిస్తున్నారు. కన్నడ మద్యం దుకాణాల నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో నగదును జమచేస్తే మద్యాన్ని వారే ఏపీ సరిహద్దుకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి స్మగ్లర్లు సులభంగా తమిళనాడుకు రవాణా చేస్తున్నారు. మరికొందరు కర్ణాటక నుంచి ఇక్కడికి చేరిన సరుకును ఇళ్లల్లో కాకుండా గ్రామాల్లోని పొలాలు, గడ్డివాములు, భూమిలో పాతిపెట్టి, ఆపై తమిళనాడుకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

చౌకబేరము!



కర్ణాటక నుంచి తమిళనాడు చేరుతున్న కన్నడ టెట్రా ప్యాకెట్లు

కన్నడ మద్యం తమిళనాడుకు

పలమనేరు నియోజకవర్గంలోని వీకోట కర్ణాటకు ఆనుకొని ఉంది. ఇక్కడ కన్నడ మద్యం ఎంతైనా దొరుకుతుంది. బైరెడ్డిపల్లి మండలంలోని కర్ణాటక బోర్డర్‌లోనూ కన్నడ మద్యం దుకాణాలున్నాయి. కుప్పం నియోజకవర్గం సైతం ఓ వైపు కర్ణాటక.. మరోవైపు తమిళనాడులకు సరిహద్దుగా ఉంటోంది. కొందరు ఇక్కడి కూటమి నేతల అండతో యథేచ్ఛగా తమిళనాడు తీసుకెళ్లి దొంగచాటుగా టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నారు.

ఏపీ నుంచి తమిళనాడుకు

ఇక జిల్లాలోని చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, పుత్తూరు నియోజకవర్గాలకు ఆనుకొని తమిళనాడు ఉంది. ఈ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇక్కడి మద్యాన్ని తమిళనాడుకు చేరవేస్తున్నారు. ఇక్కటి మద్యం షాపుల నిర్వాహకులు ప్రైవేటు వారు కావడం స్మగ్లర్లకు కలిసివస్తోంది. అప్పుగా సైతం ఏపీ మద్యం కేసులను తీసుకెళ్లి తమిళనాడులో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు.

ఆగిన తనిఖీలు

గత ప్రభుత్వంలో సెబ్ స్క్వాడ్‌లు నిరంతరం బోర్డర్లలో నిఘా పెట్టేవారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సెబ్‌ను తీసేసింది. కేవలం ఎక్సైజ్ శాఖ మాత్రమే అదీ మద్యం దుకాణాల నిర్వహణలో ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాపై అసలు తనిఖీలే లేకుండా పోయాయి.

ఏపీలో చీఫ్ ట్రిక్స్

ఏపీలోని మద్యం ప్రియులకు రూ.99కే మద్యం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. ఇక్కడున్న మద్యం కంటే కన్నడ మద్యం ధర తక్కువ. దీంతో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇప్పటికీ కన్నడ టెట్రాప్యాకెట్లే రాజ్యమేలుతున్నాయి.

కర్ణాటకాకు చెందిన విస్కీ, ఒరిజినల్ చాయిస్, డీలక్స్ విస్కీ, త్రిబుల్‌ఎక్స్ రమ్, ఓల్డ్ అడ్మిరల్, బ్రాందీ తదితర బ్రాండ్లు 180 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల రూపంలో దొరుకుతున్నాయి. అక్కడ వీటి ధరలు ఒక్కో ప్యాకెట్ 90 ఎంఎల్ రూ.45, క్వార్టర్ ప్యాకెట్ రూ.90గా ఉంది. అదే సరుకు తమిళనాడుకు చేరితే 90 ఎంఎల్ రూ.100, క్వార్టర్ రూ.140గా ఉంది. కన్నడ కిక్కుకు అలవాటు పడిన మందుబాబులు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. రోజుకు రెండు కేసులు అమ్మినా రూ.5 వేలదాకా మిగులుతోంది.

చెట్టును ఢీకొన్న సుమో

– యువకుడికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న సుమో ముందు భాగం



తీవ్రంగా గాయపడిన ప్రవీణ్

గంగవరం: మండలంలోని కల్లుపల్లి గ్రామ సమీపంలో ఏపీ గోడౌన్ వద్ద గురువారం సుమో చెట్టును ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం కరిడిమడుగు గ్రామానికి చెందిన ప్రవీణ్(22) పట్టణంలో మినరల్ వాటర్‌ను తరలించే వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పలమనేరులోని పూల మార్కెట్ నుంచి పూల హారాలు తీసుకుని స్నేహితుడు మోహన్‌తో కలిసి బోయకొండకు బయలుదేరారు. తిరిగి వస్తుండగా మండలంలోని కల్లుపల్లి సమీపంలోని ఏపీ గోడౌన్ వద్ద సుమో ముందు టైరు పంక్చర్ అయి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. మోహన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సుమో ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన భక్తుల అప్పగింత

తిరుమల: తిరుమలలో తప్పిపోయిన ముగ్గురు భక్తులను పోలీసులు డిజిటల్ జియోటాక్ సహకారంతో సురక్షితంగా పట్టుకుని, బంధువులకు అప్పగించారు. వివరాలు.. తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నంద్యాలకు చెందిన పీ.మోహిత్‌రెడ్డి(14), ప్రకాశం జిల్లాకు చెందిన పీ.నరసింహరావు(52), తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన మారుతి(70) తప్పిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు డిజిటల్ జియోటాక్ టెక్నాలజీ సహాయంతో వారిని సురక్షితంగా పట్టుకున్నారు. ఆపై వారి తల్లిదండ్రులు వెంకటసుబ్బమ్మ, ఎం.నారాయణ, మణికి అప్పగించారు.

భక్తుల భద్రత మా బాధ్యత

భక్తుల భద్రత మా బాధ్యతని, వారి భద్రత కోసం చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తులు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, డిజిటల్ టెక్నాలజీ వినియోగంతో భక్తుల భద్రత మరింత బలోపేతం అవుతుందన్నారు. భవిష్యత్‌లో కూడా భక్తుల కోసం మరిన్ని సరికొత్త సదుపాయాలు అందించడానికి జిల్లా పోలీసులు కృషి చేస్తారని తెలిపారు.

జ్ఞానానికి గమ్యస్థానం ఐకేఎస్ కేంద్రం

తిరుపతి సిటీ: ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే కేంద్రంగా ఇండియన్ నాలెడ్జ్ సెంటర్ (ఐకేఎస్) ప్రారంభించడం శుభపరిణామమని ఎస్వీయూ చాన్సలర్ ప్రొఫెసర్ నీడా మంగళం గోపాలస్వామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో అతిథులు, వర్సిటీ అధికారులతో కలసి ఆయన ఐకేఎస్ కేంద్రాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి విజ్ఞాన, వైజ్ఞానిక అంశాలను అందించడమే ఐకేఎస్ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. విదేశీయులకు సైతం వర్సిటీలోని ఐకేఎస్ కేంద్రం జ్ఞానానికి గమ్యస్థానం కావాలని ఆకాంక్షించారు. అనంతరం బ్రహ్మశ్రీ సహస్రావధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ మాట్లాడుతూ భారతీయ జ్ఞానపరంపరలో విశిష్ట పర్వం అవధానమని, అవధాన కళ విద్యార్థుల్లో స్మృతి శక్తిని, ప్రతిభాశక్తిని వర్ధింపజేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భారతీయ జ్ఞాన పరంపరంలోని అనేక వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, న్యూఢిల్లీ జాతీయ కోఆర్డినేటర్ గంటి సూర్యనారాయణమూర్తి, డీన్లు రజనీకాంత్, దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ శివ రామభట్ పాల్గొన్నారు.

మరమ్మతులకు పచ్చజెండా



వనదుర్గాపురం రోడ్డు పనులను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎంపీపీ



మహదేవపురం ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో జిల్లా కలెక్టర్

పాలసముద్రం : స్థానిక రెవెన్యూ కార్యాలయ మరమ్మతులకు నివేదికలు పంపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తహసీల్దార్ అరుణకుమారిని ఆదేశించారు. గురువారం పాలసముద్రం రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. పెచ్చులూడి, అధ్వానంగా ఉండడంతో వెంటనే మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంతమేర నిధులు అవసరమవుతాయని ఏఈ జయరాజ్‌ను అడగగా రూ.15 లక్షల వరకు అవుతుందని చెప్పారు. రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వస్తున్న రైతులతో స్నేహభావంతో మెలగాలని సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరు నుంచి బలిజకండ్రిగకు వస్తున్న జాతీయ రహదిరి కూడా అధ్వాన్నంగా ఉందని, దాన్ని కూడా త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో వనదుర్గాపురం నుంచి మండల కేంద్రానికి రోడ్డు పనులు ప్రారంభించారని, అవి అర్ధంతరంగా ఆగిపోవడంతో తమిళనాడు రాష్ట్రం మీదుగా 15 కి.మీ చుట్టుతిరిగి రావాల్సి వస్తోందని ఎంపీపీ శ్యామలశివప్రకాష్ రాజు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి చర్యలు చేపడుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏఓ ఢిల్లీప్రసాద్, ఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓ తంగరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయ పంటలు, కూరగాయలను తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. గురువారం మహదేవపురం, తిరుమలరాజుపురంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రం, నర్సరీని ఆయన పరిశీలించారు. రసాయనాలతో సాగు చేసే పంటలు హానికరమని, రైతులు ప్రకృతి పద్ధతిలో సాగుపై ఆసక్తి చూపాలని తెలిపారు. అనంతరం తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల సమీపంలో పాడైన బావిని పూడ్చి వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణ కుమారి, ఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు మోసగాళ్లకు రిమాండ్

• రూ.65 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

యాదమరి: స్థానిక యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల బంగారాన్ని తాకట్టుపెట్టి వాటిని నకిలీ ఐడీలతో అక్రమంగా రుణాలు పొందిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ చెప్పారు. ఆయన కథనం మేరకు.. 2024 నవంబర్‌లో యూనియన్ బ్యాంకులో కొంతమంది ఖాతాదారులు బంగారంపై రుణాలు తీసుకున్నారు. బ్యాంకులో పనిచేస్తున్న అప్రైజర్ భాస్కరాచారి అప్పటి మేనేజర్ మురళితో కలసి చేతివాటం ప్రదర్శించాడు. ఖాతాదారులు బ్యాంకులో తాకట్టుపెట్టిన బంగారాన్ని తక్కువ నాణ్యతగా చూపించాడు. ఈ క్రమంలో మండలంలో తనకు పరిచయం ఉన్న వ్యక్తులతో కలసి నకిలీ ఖాతాలు తెరిచి ఆ బంగారంపై రుణాలు తీసుకున్నారు. అయితే బ్యాంకులో జరిగిన అంతర్గత ఆడిట్‌లో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై యాదమరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం అప్పట్లో జిల్లాలో సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం బ్యాంకును మోసం చెయ్యడంలో కీలక పాత్ర వహించిన అప్రైజర్ భాస్కరాచారి(ఏ1), బ్యాంకు మేనేజర్ మురళి(ఏ6) ముద్దాయిలను యాదమరి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ మోసానికి సహకరించిన వరదరాజులపల్లికి చెందిన అవినాశ్(ఏ2), దర్శిని(ఏ3), ముస్లింవాడకు చెందిన మాలిక్(ఏ5)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఏ4 ముద్దాయిగా ఉన్న మాధవరానికి చెందిన భువనేశ్వరి మృతి చెందారని ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి 24 మంది ఖాతాదారులు రూ.65 లక్షల విలువైన మేలిమి బంగారాన్ని రికవరీ చేసి, కోర్టుకు సమర్పించామని చెప్పారు. సంబంధిత ఖాతాదారులు తాము తీసుకున్న రుణాలు చెల్లించిన తరువాత బంగారు ఆభరణాలు వారికి అందజేయాలని ప్రస్తుత బ్యాంకు మేనేజర్‌కు కోర్టు ఆదేశాలు జారీచేసిందన్నారు.

నోటీసు ఇవ్వకనే నగలు వేలం!

• నిర్వాహకుడ్ని నిలదీసిన బాధితులు

పలమనేరు: తాము ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో తనఖా పెట్టిన నగలకు గడువు మీరిందని నోటీసు ఇవ్వకుండానే తమ బంగారాన్ని వేలం వేసిందే కాకుండా మళ్లీ నెలనెలా వడ్డీ వసూలు చేశారని బాధితులు ఆ కంపెనీ నిర్వాహకులను నిలదీశారు. ఈ ఘటన గురువారం పలమనేరులో చోటుచేసుకుంది. వివరాలు.. బైరెడ్డిపల్లి మండలం, సీసీ గుంటకు చెందిన నల్లమణి 4.4 గ్రాములు, కేశవ 20 గ్రాముల బంగారు నగలను పట్టణంలోని కీర్తన ఫైనాన్స్ కంపెనీలో తనఖా పెట్టారు. ఇందుకు సంబంధించి వీరు నగలు సకాలంలో విడిపించుకోలేదని కంపెనీవారు గత ఏప్రిల్‌లో ఆ నగలను వేలం వేశారు. ఇందుకు సంబంధించి బాధితులకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వలేదని బాధితులు తెలిపారు. అంతేకాకుండా మేలో సైతం తాము పెట్టిన నగలకు వడ్డీ కట్టించుకున్నారని ఆరోపించారు. నగలు ఇప్పటికే వేలం వేశారని తెలిసిన బాధితులు సంబంధిత కంపెనీ మేనేజర్‌తో గురువారం గొడవకు దిగారు. దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.



ఫైనాన్స్ నిర్వాహకులను ప్రశ్నిస్తున్న బాధితులు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కషాయం తయారీపై రైతులకు వివరిస్తున్న అధికారులు

చౌడేపల్లె: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని డీపీఎం జి.వాసు తెలిపారు. ఆయన గురువారం బోయకొండ సమీపంలోని గట్టువారిపల్లెలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫామింగ్ రైతు సాధికార సంస్థ (ఈపీఎస్) ఆధ్వర్యంలో జిల్లాలో 263 క్లస్టర్లలో ప్రకృతి సేద్యంపై రైతులను చైతన్యవంతులను చేశామన్నారు. వేరుశనగ, వరి, కూరగాయల పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లోనూ ప్రకృతి సేద్యం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే సాగుచేసిన వరి పంటతోపాటు కషాయాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్పీ ఎంఎంటీ సుధాకర్ నాయుడు, ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గంగిరెడ్డి, రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

దృఢత్వానికి ప్రతీక భారతీ అల్ట్రా సిమెంట్

కేవీబీపురం: నమ్మకానికి, దృఢత్వానికి భారతీ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ప్రతీకగా నిలుస్తుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ పీ.చాయాపతి తెలిపారు. గురువారం కేవీబీపురం మండల కేంద్రంలోని టీడీ ఆర్ స్టీల్ అండ్ సిమెంట్ అధినేత తాటిపర్తి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చాయాపతి మాట్లాడుతూ జర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతీ అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకంతో కూడా మార్పులు ఉండవన్నారు. సిమెంట్ రంగంలో భారతీ సిమెంట్ అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. అనంతరం భారతీ సిమెంట్‌కు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు.

అక్రమ క్వారీల ఆగడాలను నివారించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాలసముద్రం మండలంలో అక్రమ క్వారీల ఆగడాలను నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ పాలసముద్రంలో గుట్టలను తవ్వి గ్రావెల్‌ను యథేచ్ఛగా తమిళనాడుకు తరలిస్తున్నారని ఆరోపించారు. తద్వారా రూ.లక్షలు ఆర్జిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. లీజు అనుమతికి మించి గ్రావెల్‌ను తవ్వేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

కూలి పనులకెళ్తూ..!







మృతురాలు అలివేలమ్మ గాయపడిన మహిళలు







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ఘటనా స్థలంలో వివరాలను సేకరిస్తున్న రొంపిచెర్ల పోలీసులు

• ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్
• మహిళ మృతి
• మరో తొమ్మిది మందికి గాయాలు

రొంపిచెర్ల: ఆటోను గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందగా మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బెంగళూరు– తిరుపతి జాతీయ రహదారిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. బాధితుల కథనం.. రొంపిచెర్ల మండలం, రామచంద్రాపురం కాలనీ, మూరేవాండ్లపల్లె, పిచ్చిగుంట్లవారిపల్లె గ్రామాలకు చెందిన మహిళలు అన్నమయ్య జిల్లాలోని కలకడ మండలంలో టమాట తోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం ఆ మూడు గ్రామాలకు చెందిన 14 మంది మహిళలు ఆటోలో కలకడకు బయల్దేరారు. నేషనల్ హైవేలోని బోనంవారిపల్లె సమీపంలో ఆటోను పీలేరు వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిచ్చిగుంట్లవారిపల్లెకు చెందిన అలివేలమ్మ (53) మృతి చెందారు. అలాగే మూరేవాండ్లపల్లెకు చెందిన పీ.రత్నమ్మ, పీ.లక్ష్మీదేవి, పీ.శాంతమ్మ, టీ.నారాయణమ్మ, పీ.కమలమ్మ, పీ.నారాయణమ్మ, రామచంద్రాపురం కాలనీకి చెందిన పీ.రాణి, ఎం.రాములమ్మ, పిచ్చిగుంట్లవారిపల్లెకు చెందిన రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని రొంపిచెర్ల ఎస్‌ఐ సుబ్బారెడ్డి పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రొంపిచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన జెడ్పీటీసీ

క్షతగాత్రులను జెడ్పీటీసీ రెడ్డిశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన నేరుగా పీలేరు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం ఈ విషయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తెలయజేశారు. బాధితులకు దగ్గరుండి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.